సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం ၊ 31 ၊ మార్చి ၊ 2025



ముందు సొగసు..వెనుక బోగసు

ఒంటిమిట్ట రామాలయ పెయింట్ పనుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో కాంట్రాక్టర్ ఆలయం ముందువైపు రంగు కొట్టి వెనుకవైపు వదిలేయడం గమనార్హం. - 8లో



అనంతపురం గంగమ్మకు పూజలు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గంగమ్మ దేవతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రంజాన్ శుభాకాంక్షలు

రాయచోటి జగదాంబసెంటర్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగను భక్తిశ్రద్ధలతో.. ఆనందంగా జరుపుకోవాలని తెలియజేశారు. జిల్లా ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు, దీవెనలు అందాలని ఆకాంక్షించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావులు కూడా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' తాత్కాలిక రద్దు

రాయచోటి : ఈనెల 31వ తేదీ రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ తెలిపారు.

రాయచోటి వాసికి అవార్డు



గుండాల రెడ్డిరాఘవేంద్ర

రాయచోటి టౌన్ : ఒడిశా పోలీసు శాఖ అందించే ప్రతిష్టాత్మకమైన డీజీపీ డిస్క్ అవార్డును రాయచోటి పట్టణానికి చెందిన గుండాల రెడ్డిరాఘవేంద్ర (ఐపీఎస్) అందుకోనున్నారు.ఆయన ప్రస్తుతం ఒడిశాలోని నౌపాడా జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. 2024–25 సంవత్సరానికి అవార్డును అందుకోవడానికి ఎంపికైన పోలీసు సిబ్బంది పేర్లను ఒడిశా పోలీసు రాష్ట్ర ప్రధాన కార్యాలయం ప్రకటించింది. చలపతిని ఎన్‌కౌంటర్ చేయడంలో ప్రధాన పాత్ర పోషించడంతో పాటు నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించడంలో కృషి చేసినందుకు అవార్డు అందుకోనున్నారు.అవార్డు గ్రహీతలను 2025 ఏప్రిల్ 1న పోలీసు నిర్మాణ దినోత్సవం సందర్భంగా సత్కరించనున్నట్లు రెడ్డిరాఘవేంద్ర తెలిపారు.

ఒంటిమిట్ట క్షేత్రంలో ఉగాది వేడుకలు



పంచాంగ పఠనం చేస్తున్న పురోహితులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో ఆదివారం ఉగాది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ రంగమండపంలో సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను పుష్పాలతో అలంకరించి ఆశీనులు చేశారు. అర్చనలు జరిపారు. కర్పూరహారతి ఇచ్చారు. అనంతరం పురోహితులు ఏకలేశ్వరం గురుస్వామి శాస్త్రోక్తంగా పంచాంగ పఠనం నిర్వహించారు.ఈ సందర్భంగా 12 రాశుల ఫలితాలను భక్తులకు వివరించారు. సాయంత్రం సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు.ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్ కుమార్, శ్రావణ్ కుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

నెలరోజుల భక్తి.. ఏడాదంతా స్ఫూర్తి

- నేడు ఈద్– ఉల్– ఫితర్
- నెలవంక దర్శనంతో ముగిసిన ఉపవాసదీక్షలు
- ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు

మదనపల్లె సిటీ/రాజంపేట టౌన్ : ఎదురు చూసిన మధుర క్షణం వచ్చేసింది. వరాలనిచ్చే శుభాల గీతం వినిపించనుంది. నెల రోజుల పవిత్ర ఉపవాసదీక్షలకు ప్రతిఫలం లభించే రోజు రానే వచ్చింది. అల్లా ఆదేశాలను త్రికరణశుద్ధిగా పాటించి అల్లాకు కృతజ్ఞతలు తెలియజేసే సమయం ఆసన్నమైంది. నెల రోజుల ఉపవాసాల ద్వారా పేదలను ఆదుకునే గుణం ఏర్పడింది. ఖురాన్ పారాయణం, తరావీ నమాజులు, ఆత్మకు స్వాంతన ఇచ్చాయి. షవ్వాల్ నెలవంక ఆదివారం సాయంత్రం దర్శనం కావడంతో పవిత్ర రంజాన్‌మాసం ఉపవాసదీక్షలు ముగిశాయి. దీంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా సమత,మమతల కలయిక, దాన,ధర్మాలకు ప్రతీకగా నిలిచే ఈద్–ఉల్–ఫితర్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని ఈద్గాలలో ఆయా ఈద్గా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పూర్తి చేశారు ముస్లింల పండుగల్లో రంజాన్ ఈద్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలోనే దివ్య ఖురాన్ అవతరించడం, మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి తన శాంతి సందేశాన్ని పంపడం జరిగింది. ఆయన సందేశం ప్రకారమే ప్రతి ముస్లిం నడిచుకుని, దైవభక్తి, దాతృత్వ గుణాన్ని అలవర్చుకుని ముందుకెళతారు.

సమాజ వికాసం..రంజాన్ పరమార్థం

ఉపవాసం సామాజిక జీవనానికి మూలం. సోదరభావం, సౌభ్రాతృత్వం, దాతృత్వమే పునాదిగా ఉపవాస దీక్ష వెల్లివిరుస్తుంది. రంజాన్‌మాసంలో ప్రతి ముస్లిం ఉపవాసాన్ని పాటిస్తారు. ఎంతటి ఐశ్వర్యవంతుడైనా, కటిక పేదవాడైనా ఉపవాస వ్రతం ఉండి తీరాల్సిందే. సాటి మానవుని ఆకలి బాధ, కష్టాలు తెలుసుకుని వారిని ఆదుకోవడం, వారి పట్ల దయాగుణాన్ని పెంపొందించుకోవడమే దీక్షల పరమార్థం. దాన,ధర్మాలు చేయటం, ఆర్థిక సహకారం అందించటం తన వంతు బాధ్యతగా భావిస్తారు.

పేదల హక్కు జకాత్

పవిత్ర రంజాన్‌మాసంలో ప్రతి ఒక్క ముస్లిం స్థిర, చరాస్తులు,నగలు, నగదు మొత్తాన్ని వెలకట్టి అందులో నుంచి 2.5 శాతం జకాత్ రూపంలో పేదలకు దానం చేయాలి. దీంతో పాటు ఫిత్రా కూడా చెల్లించాలి. పేదలు కూడా రంజాన్ పండుగను సంతోషంగా గడుపుకోవాలన్నదే దీని ఆశయం. జకాత్,ఫిత్రా పేదల హక్కు.



విద్యుత్ వెలుగులతో మదనపల్లెలోని జామియా మసీదు



రాయచోటిలో హజరత్ జమాల్‌బాషా ఈద్గాను పరిశీలిస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

ఈద్గావద్ద ప్రార్థన ప్రవక్త ఆజ్ఞ

రంజాన్ పండుగ రోజున ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన చేయాలన్నది మహమ్మద్ ప్రవక్త ఆజ్ఞ అని మతపెద్దలు చెబుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఈద్గా వసతి లేని వారు మినహా మిగిలిన ముస్లింలంతా ఈద్గా వద్దే నమాజ్ చేయాలి. ఈద్గాలో జమాత్ సాత్ (ముస్లింలు కలిసి) నమాజ్ చేయడం వల్ల పుణ్యం దక్కుతుందని వారు చెబుతున్నారు. ఈనమాజ్‌లో గరీబ్, అమీర్ (పేద, ధనిక) అన్న తారతమ్యం లేకుండా అందరూ ఒకరిపక్కన మరొకరు వరుసగా నిలుచొని ప్రార్థన చేయడం వల్ల సమాజంలో అందరూ సమానమే అన్న భావన స్ఫురింపజేస్తుంది.

ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబు

రాయచోటి అర్బన్ : ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం చివరి దశగా చేరుకుంది. పండుగ రోజున నిర్వహించే సాహూహిక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాయచోటి పట్టణంలో ఈద్గాలు సిద్ధమయ్యాయి. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే పాత ఈద్గా, హజరత్ జమాలుల్లా బాష ఈద్గాలను కమిటీ సభ్యులు ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. . పట్టణం లో వేలసంఖ్యలో ప్రజలు ప్రార్థనల కోసం విచ్చేసే హజరత్ జమాలుల్లా బాషా ఈద్గాను కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ బేపారి మహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సిద్ధం చేశారు. ప్రార్థనలకు విచ్చేసే వారు ముందుగా ఒజుఖానా చేసుకునేందుకు, నీటి వసతి తదితర ఏర్పాట్లను వర్కింగ్ ప్రెసిడెంట్ బేపారి మహమ్మద్ ఖాన్ మైనార్టీ నేతలతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండుగ రోజున ముస్లిం మత గురువు సర్కాజీ షర్ఫుద్దీన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకే ప్రార్థనలు నిర్వహించేలా పెద్దలు నిర్ణయించారన్నారు. ఎండతీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో చిన్నపిల్లలను తీసుకువచ్చేవారు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముస్లిం,మైనార్టీ సోదరులందరికీ ఆయన ముందస్తు ఈద్‌ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు అన్నా సలీం, బేపారి జబీవుల్లాఖాన్, గౌస్‌బేగ్, ఖలీల్‌బేగ్, బేపారి అసద్‌ఖాన్, ముజఫర్, ఫైజాన్, రిజ్వాన్, ఖాదర్‌ఖాన్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

నియమాలు జీవితాంతం పాటించాలి



రంజాన్ ఉపవాసాల ద్వారా నేర్చుకున్న నియమ నిబంధనలు జీవితాంతం పాటించాలి. ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడం ద్వారానే భగవంతుని సులభంగా తెలుసుకోగలం. ఇస్లాం శాంతి సందేశాన్ని ప్రబోధిస్తుంది. ఇస్లాంలో హింసకు స్థానం లేదు. అందరినీ అల్లా సన్మార్గంలో నడపాలని ప్రార్థనలు చేద్దాం.

– జలాలుద్దీన్‌సాహెబ్, ప్రభుత్వ ఖాజీ, మదనపల్లె

శాంతికోసం ప్రార్థించాలి



రంజాన్ మాసంలో ముస్లింలు అలవరుచుకున్న సద్గుణాలను అలాగే కొనసాగించాలి. లేకపోతే రంజాన్ మాసంలో చేపట్టిన దీక్షకు సార్థకత ఉండదు. సద్గుణాలను కొనసాగించినప్పుడే అల్లాహ్ కరుణ ఉంటుంది. ఈద్ సందర్భంగా ప్రతి ముస్లిం ప్రపంచ శాంతికోసం ప్రార్థించాలి.

– మౌలానా అతాఉల్లాహ్, ఇమామ్, రాజంపేట

బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బలిజపల్లె గంగమ్మ జాతర రెండో పెద్ద జాతరగా ప్రసిద్ధిగాంచింది. ఏప్రిల్ 3వ తేదీ జరగనున్న గంగమ్మ జాతరకు ఆదివారం రాత్రి నిర్వాహకులు అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అంకురార్పణ వేడుకను తిలకించేందుకు పట్టణ వాసులే కాక వివిధ గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది. .

గంటకు పైగా పూజలు

గంగమ్మ జాతర అంకురార్పణ వేడుక సందర్భంగా నిర్వాహకులు గంగమ్మ స్వయంభుకు గంటకు పైగా పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి స్వయంభును పుష్పాలతో అలంకరించారు. ఒకవైపు పూజా కార్యక్రమాలు జరుగుతుండగా, మరోవైపు తప్పెట్ల దరువులు, కొమ్ము ఊదడం, గంగమ్మ ఆవహించిన భక్తులు ఊగిపోవడం చూసి భక్తులు ఆనందపరవశులయ్యారు. జాతర అంకురార్పణకు ప్రధాన ఘట్టమైన పోతు మెడలో దండ పడగానే భక్తులు పెద్దఎత్తున చప్పట్లు చరిచి, ఈలలు, కేకలు వేయడంతో బలిజపల్లె గ్రామం దద్దరిల్లింది. ప్రతి ఏడాది అంకురార్పణకు వేలాది మంది భక్తులు తరలి వస్తారు. దీంతో తోపులాటలు జరిగేవి. అయితే ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే చొరవ తీసుకోవడంతో ఈఏడాది తోపులాటలు వంటివి జరగకుండా అర్బన్ సీఐ రాజ, ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. గంగమ్మ స్వయంభు ప్రాంగణం చుట్టూ రోప్ ఏర్పాటు చేసి తోపులాటలకు చెక్ పెట్టారు.



జాతరకు అంకురార్పణ చేస్తున్న నిర్వాహకులు



అంకురార్పణ వేడుకను తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులు

ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్
- రాయచోటిలో ఘనంగా ఉగాది వేడుకలు

రాయచోటి : అన్నమయ్య జిల్లా ప్రజలు శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం రాయచోటి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, దేవదాయశాఖ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌లకు వీరభద్ర స్వామి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పండుగ వేడుకలను ప్రారంభించారు. జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిసి పల్లె సీమలు పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని కలెక్టర్ అభిలషించారు. ఉగాది పండుగ తెలుగు వారికి ఎంతో ప్రత్యేకమని, తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆనందంగా ఆరోగ్యంగా సురక్షితంగా జీవించాలని కోరుకుంటున్నానని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తదితరులు



పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు శ్రీ రాచయోగీష్ స్వామి

పంచాంగ శ్రవణం....

రాయచోటి పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయ అర్చకులు శ్రీరాచ యోగీష్ స్వామి పంచాంగ శ్రవణం చేశారు.శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అనగా విశ్వమంతా అభివృద్ధి చెందాలి అని అర్థం వస్తుందని అన్నారు. నూతన సంవత్సరంలో అందరికీ శుభ ఫలితాలు రానున్నాయన్నారు. అనంతరం రాశి ఫలాల గురించి చదివి వినిపించారు.

కవి సమ్మేళనం....

తెలుగుభాష గొప్ప తనాన్ని, తెలుగు ప్రత్యేకతను చాటి చెబుతూ తెలుగు పద్యాలతో కవిసమ్మేళనం ఆకట్టుకుంది. కార్యక్రమంలో వెంకటరమణ, లోక జగన్నాథ శాస్త్రి, అడపాల వెంకటరమణ, రామచంద్ర, అల్లం అశోక్ కుమార్, సుబ్బరాఘవరాజు, సుబ్రమణ్యం గౌడ్, మురళీధర రాజులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉగాది పురస్కాల ప్రదానం

ఉగాది పురస్కారాలలో భాగంగా ఈ సంవత్సరం జిల్లాకు చెందిన నలుగురికి పురస్కారాలు అందజేశారు. రామసముద్రం మండలానికి చెందిన పార్థసారథి బట్టర్, పీటీఎం మండలానికి చెందిన సదాశివప్ప, కలికిరి మండలానికి చెందిన నారాయణమూర్తి, ఓబులవారిపల్లి మండలానికి చెందిన వాసుదేవ శర్మలకు దేవదాయశాఖ ద్వారా ఒక్కొక్కరికి రూ. 10116, ప్రశంసా పత్రంపంచాంగాలను కలెక్టర్, ఎస్పీ, అందజేశారు. జిల్లాకు చెందిన నలుగురు ఆదర్శ రైతులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. సన్మానం పొందిన వారిలో ధర్మారెడ్డి, రెడ్డి గఫార్, పెంచలయ్య నాయుడు, జనార్దన్ రెడ్డి ఉన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని సభికులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంబై ఐఐటీలో వెలిగిన తెలుగుతేజం



సాయిదివ్యతేజరెడ్డి

రాయచోటి జగదాంబ సెంటర్ : ముంబై ఐఐటీ కళాశాలలో జరిగిన అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ) సోషల్ సెక్రటరీ ఎన్నికలో అన్నమయ్య జిల్లా రాయచోటి తాలూకా చెన్నముక్కపల్లి గ్రామానికి చెందిన సాయిదివ్యతేజరెడ్డి విజయం సాధించాడు. మురికినాటి శ్రీనివాసులురెడ్డి, జయలక్ష్మీల కుమారుడైన సాయిదివ్యతేజరెడ్డికి ముంబై ఐఐటీలో సీటు వచ్చింది. ఇటీవల జరిగిన యూజీ సోషల్ సెక్రటరీ ఎన్నికలో పోటీ చేశాడు. గెలుపొందాడు. ఐఐటీ ముంబై చరిత్రలో మొదటిసారిగా ఒక తెలుగువాడు ఎన్నిక కావడం ఇదే తొలిసారి. సాయిదివ్యతేజరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

ఎండ ప్రచండం!

ఎండలు అదరగొడుతున్నాయి. పొగలు కక్కుతున్న భానుడి దెబ్బకు రోడ్లపై సెగలు పుడుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ముందుగానే ఎండలు చురుక్కుమంటున్నాయి. మార్చి మొదటి వారంలోనే వేడెక్కిన సూరీడు.. నెల దాటేసరికి నిప్పులు కక్కుతున్నాడు. వెరసి జనాలు అల్లాడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఎండ దెబ్బకు జ్వరాలబారిన పడుతున్నారు.



- వేడెక్కిన సూరీడు.. 'ఉక్క'రిబిక్కిరవుతున్న జనాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



పులివెందుల రూరల్ : పది రోజులుగా ఎండల ప్రభావం తీవ్రంగా ఉండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయంతో జంకుతున్నారు. ఎండ తీవ్రతకు గురై చాలా మంది అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఎండలో తిరగడంవల్ల జ్వరాలతోపాటు దగ్గు, జలుబు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా వేసవి కాలంలో కూడా దగ్గు, జలుబు, జ్వరాలు రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వడదెబ్బకు అప్రమత్తతే శ్రీరామరక్ష

ఎర్రగుంట్ల : ఎండ తీవ్రత అధికమైంది, ప్రస్తుతం జిల్లాలో 40–42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్(శరీరంలో నీటి శాతం తగ్గడం) డయేరియా(విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎర్రగుంట్ల, చిలంకూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలియజేశారు. ప్రజలు వేసవిలో వీలైనంతగా పని చేయకుండా ఉండడం మంచింది. ఉదయం సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి, ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది.

ఆరోగ్య సమస్యలు ఇవే



ఎండ తీవ్రత వల్ల ఆకస్మికంగా వాంతులు విరేచనాలతోపాటు తీవ్ర కడుపు నొప్పి వస్తుంది. చలితో కూడిన జ్వరాలు, తీవ్రమైన చలితో బాధపడుతుంటారు. వికారంగా ఉండటం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎండలో తిరిగే వారిలో చాలామందికి రాత్రిళ్లు నిద్ర పట్టదు.

జాగ్రత్తలు తప్పనిసరి



ఈ సారి వేసవికాలం మార్చి మొదటి వారంలోనే ప్రారంభమైంది. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సంబంధిత వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండలో వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు అంటున్నారు. మంచినీరు ఎక్కువగా తాగాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం రక్తపోటు క్యాన్సర్ వంటి దుర్ఘటకాలిక రోగులు మరింతగా అప్రమత్తంగా ఉండాలని వివరిస్తున్నారు. గర్భిణీలు, ఐదేళ్లలోపు చిన్నారులు తప్పనిసరిగా ఈ జాగ్రత్తలు పాటించాలి.

రోజుకు 4 లీటర్ల నీరు తాగాలి



కలకడ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వేడిగాలుల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందలు ఎదుర్కొంటున్నారు. వేసవిలో వృద్ధులు, చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈసమయంలో మంచినీరును అధికంగా తీసుకుని, కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వేడిమి నుంచి ఉపశమనం పొందొచ్చని కలకడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున సూచిస్తున్నారు. ప్రతి వ్యక్తి రోజుకు నాలుగు లీటర్ల నీరు తాగడం చాలా అవసరం. ప్రతి 2గంటలకు అరలీటరు నీటిని విధిగా తాగాలి. భోజనం తినే సమయంలో తక్కువగా..అరగంట ఆగిన తర్వాత ఎక్కువ నీరు తాగాలని తెలియజేస్తున్నారు. అలాగే వేసవి కాలంలో ప్రయాణాలు తగ్గించాలని సూచిస్తున్నారు.

ఎన్నడూ లేని విధంగా ఎండలు



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎండలు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బయటికి రావాలంటేనే భయమేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు ఎవరూ బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– బాబు, స్థానికుడు, పులివెందుల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు జాగ్రత్తలు తీసుకుని బయటికి వెళ్లాల్సి ఉంటుంది. కొబ్బరి బొండాలు, మంచినీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. పనులమీద బయటికొచ్చిన వారు మధ్యాహ్నం 12.30 గంటలకల్లా ఇంటికి చేరాలి. ఎండాకాలంలో ప్రజలు వైద్యుల సలహా తీసుకుంటే చాలా మంచి.

– డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్, పులివెందుల

వేసవిలో చేయకూడని పనులు..

- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం తాగరాదు.
- రోడ్లపై మీద చల్లని రంగు పానీయాలకు దూరంగా ఉండాలి.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం జోలికి వెళ్లకపోవడమే మంచిది.
- వేసవిలో మాంసాహారం తగ్గించడం శ్రేయస్కరం
- ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు.

చేయాల్సిన పనులు

- నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీటితో పాటు, ద్రవ ప్రదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి. పరిశుభ్రత ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి
- భోజనం మితంగా చేయాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- ఆరుబయట పడుకున్నప్పుడు దోమ తెరలు వాడాలి
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి
- తాజా కాయగూరలు, ఎక్కువగా తీసుకోవాలి

వడదెబ్బలకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడల ప్రదేశానికి చేర్చాలి
- ఐస్ నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం బాగా తుడవాలి
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి లేకుంటే గ్లూకోజు ద్రావణం తాగించాలి
- వడదెబ్బ తగిలితే వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

క్లుప్తంగా

అనంతపురం గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత

లక్కిరెడ్డిపల్లి : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని అనంతపురం గంగమ్మ దేవతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులతో గంగమ్మ దేవత ఆలయం సందడిగా మారింది. నూతన సంవత్సరం కావడంతో ద్విచక్రవాహనదారులతోపాటు ఇతర వాహనాలకు పూజలు చేయించుకున్నారు. పూజారులు చెల్లు గంగాధర్ యాదవ్, చెల్లు గంగయ్య, చెల్లు శ్రీనివాసులు, చెల్లు స్వాతి, పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జింక మృతి



మృతి చెందిన జింక

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రానికి సమీపంలోని బూర్లపల్లెకి వెళ్లే అడ్డదారిలో ఆదివారం ఓ జింక మృతి చెందింది. జింక శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. దాహం కోసం అటవీ ప్రాంతం నుంచి వ్యవసాయ బోర్ల వద్దకు వచ్చి గుళికలు మందు కలిపిన నీళ్లను తాగి మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తమవుతోంది. ఫారెస్టు అధికారులు మూగజీవాల కోసం అటవీ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహానేతకు ఉగాది సంప్రదాయం



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అగ్రహారం సర్పంచ్

నిమ్మనపల్లె : ప్రజల కష్టాలు తనవిగా భావించి, పేదోడికి విద్య వైద్యం అందించి, ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాతగా, అభిమాన నాయకుడిగా నిలిచిన మహానేత మాజీ సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డిని, తమ కుటుంబ సభ్యుడిగా భావించి నూతన వస్త్రాలు సమర్పించి అగ్రహారం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉగాది సంప్రదాయాన్ని పాటించారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని అగ్రహారం సర్పంచ్ ఉషారాణి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గ్రామంలో మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి, నూతన వస్త్రం అలంకరించి ఉగాది సంప్రదాయాన్ని పాటిస్తూ పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామారావు, ఎర్రయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పలమనేరు మండలం బొమ్మనపల్లెకు చెందిన రాజగోపాల్(55) సొంత పనిపై కురబలకోటకు ద్విచక్రవాహనంపై వచ్చాడు. శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా అమ్మచెరువుమిట్ట వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతన్ని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన మహేష్(28) శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతన్ని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

కడప అర్బన్ : కడప నగరం అక్కాయపల్లిలో నివాసం ఉంటున్న లక్ష్మీదేవి(32) అనే మహిళ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు ఏడాది నుంచి ఆమె కడుపు నొప్పితో బాధపడుతుండేది. శనివారం రాత్రి కడుపునొప్పి రావడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించింది.

ముందు సొగసు.. వెనుక బోగసు

- ముందు వైపు మాత్రమే రంగు కొట్టి వెనుక వదిలేస్తున్నారు
- ఒంటిమిట్ట రామాలయ పెయింట్ పనుల్లో అవకతవకలు
- నాసిరకపు రంగులు వేస్తున్న వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



రామాలయం వద్ద గ్రిల్స్‌కి లోపలి భాగంలో కొట్టిన పెయింట్



కల్యాణ వేదిక వద్ద పూర్తిస్థాయిలో పెయింట్ వేయని డివైడర్ బ్రిక్స్



కల్యాణ వేదిక మొదటి గేటు ఆర్చీకి రంగులు వేసి మాసిపోయిన గ్రిల్స్‌ను వదిలేసిన దృశ్యం

ఒంటిమిట్ట : ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుమల–తిరుపతి దేవస్థానం రామాలయ పరిసరాలను నూతన రంగులతో ఆకర్షణీయంగా మెరుగులు దిద్దేందుకు సంకల్పించింది. టెండర్ల ద్వారా రంగులు వేసేందుకు కాంట్రాక్టర్లను ఎన్నుకున్నారు. రూ. 49 లక్షలతో రంగులు వేసేందుకు టెండర్‌ను తిరుపతికి చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. అయితే పెయింటింగ్ టెండర్ నియమ నిబంధనల ప్రకారం రామాలయం వద్ద ఉన్న గ్రిల్స్, డివైడర్ బ్రిక్స్, కల్యాణ వేదిక వద్ద ఉన్న స్వాగత తోరణం, కళ్యాణ వేదిక వద్ద ఉన్న వీవీఐపీ గేట్లు, అర్చకులు మెయిన్ ఎంట్రీ గేట్లు, ఆర్చీలకు, సీఎం గెస్ట్ హౌస్, పుష్కరిణి రామాలయం వద్ద ఉన్న గేట్లకు కాంట్రాక్టర్ రంగులు వేయాల్సి ఉంది. అయితే ఈ కాంట్రాక్టర్ ప్రస్తుతం గేట్లకు, గ్రిల్స్‌కు, డివైడర్ బ్రిక్స్‌కు బయటికి కనిపించేలా రంగులు కొట్టాడే తప్పా లోపల భాగంలో ఎవరికీ కనిపించలేదనే ఆలోచనతో రంగులు కొట్టకుండా విడిచి పెట్టేశాడు. ఈ పనులను చూసిన భక్తులు ఒంటిమిట్ట రామయ్యవార్షిక బ్రహ్మోత్సవాల పేరు చెప్పి కాంట్రాక్టర్ నాసిరకపు పనులు చేసి దేవుని సొమ్మును అప్పనంగా దోచేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. అంతేకాక పెయింట్ పనుల్లో నాణ్యత పరిశీలించేందుకు వచ్చే అధికారుల కోసం క్వాలిటీ పెయింట్ కలిపిన కొన్ని పెయింట్ డబ్బాలను రంగులు కలిపే చోట ఉంచి ఖాళీగా ఉన్న మేలైన కంపెనీ పెయింట్ డబ్బాలలో నాసిరకపు పెయింట్ కలిపి వివిధ ప్రాంతాలలో జరుగుతున్న పనులకు పంపిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్ని అవకతవకలు జరుగుతున్నాయంటే అధికారుల పర్యవేక్షణ అయినా లోపించి ఉండాలి లేదా తనను ఎవరు అడుగుతారు అన్న నిర్లక్ష్యం అయినా అయి ఉంటుందని భక్తులు పెదవి విరుస్తున్నారు.

అయ్యో.. జన సైనికులు!

- రాజంపేటలో జన సైనికుల తిరుగుబాటు
- పొత్తులో మా వాటా మాటేంటి
- జనసైనికులకు అన్యాయమే
- కూటమి వైఖరిపై సైనికుల్లో ఆందోళన
- అధిష్టానానికి అల్టిమేటం ఇచ్చిన క్యాడర్



రాజంపేటలోని న్యూ ఆంధ్రా కల్యాణ మండపంలో సమావేశమైన జనసేన కార్యకర్తలు

రాజంపేట : రాజంపేట నియోజకవర్గంలో జనసైనికుల పరిస్థితి అయోమయంగా మారింది. దీంతో జనసేన కార్యకర్తలు ఒకట్టై తమ సత్తా ఏమిటో తెలిసే విధంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆదివారం న్యూ ఆంధ్ర కళ్యాణ మండపంలో జనసేన కార్యకర్తలు, సెకండ్ క్యాడర్ నాయకులు సమావేశమయ్యారు. ఇందులో నియోజకవర్గ నేతలెవ్వరికి ఆహ్వానం లేకుండా పోవడం గమనార్హం. కూటమి వైఖరిపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. పొత్తులో మా వాటా మాటేంటి అని నిలదీస్తున్నారు. నామినేటేడ్ పదవుల్లో తమకు అన్యాయం జరుగుతోందన్న ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ కేంద్రం వరకు పేరుకు మాత్రమే జనసేన కార్యకర్తలుగా మిగిలిపోయామంటున్నారు. బ్యాంకు రుణాల మంజూరు, సొసైటీలతో పాటు ఇతర కేటాయింపులలో జనసేన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్న వాదన వినిపించారు.

పార్టీ నాయకత్వంపై ఆక్రోశం

పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలను పార్టీ పెద్దలు పట్టించుకోవడంలేదు. జనసేన బలోపేతానికి కృషి చేసిన వారిని పక్కన పెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పిస్తున్నారని విమర్శించారు. కార్యకర్తలకు ప్రాధాన్యత లేకుంటే పార్టీ భవిష్యత్తు ఏమిటన్నది గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. కార్యకర్తల గురించి అడిగే నాథుడు కరువయ్యాడని, అధిష్టానం కార్యకర్తల గురించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరసనలు.. ఉద్యమమే మార్గం..

నాయకత్వం స్పందించకపోతే పార్టీ కార్యకర్తలు ఉద్యమించకతప్పదని హక్కుల కోసం నిరసనలు చేపట్టాల్సి ఉంటుందని వారు స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని జనసేన యూనిట్లను చైతన్యపరిచాలన్నారు. అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి కార్యకర్తలకు స్థానికంగా జరుగుతున్న అన్యాయాన్ని తీసుకెళ్లాలని ఆత్మీయ సమావేశంలో తీర్మానం చేశారు. పార్టీ బలోపేతం కోసం అన్నీ వదులుకుని పనిచేసిన కార్యకర్తల గురించి పట్టించుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పూజకు వెళ్లిన మహిళపై దాడి



దాడిలో చెవికి గాయమైన కమలమ్మ

కురబలకోట : ఉగాది పర్వదిన సందర్భంగా గుడిలో పూజకు వెళ్లిన ఓ కుటుంబంపై వ్యక్తిగత కక్షతో కొందరు దాడి చేసిన సంఘటన కొండతూర్పులోని ఎగువపల్లెలో ఆదివారం ఉదయం జరిగింది. బాధితురాలు కమలమ్మ ముదివేడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు..ఎగువపల్లెకు చెందిన వి. మల్ రెడ్డికి అదే ఊరికి చెందిన ముగ్గురితో వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి. ఇతనిపై ఆరునెలల క్రితం కేబుల్ వైరు చోరీ కేసు పెట్టారు. చేయని నేరానికి తనపై కేసు పెట్టడం పట్ల అప్పటి నుంచి ఆయన తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. నిరూపించాలని కోరుతున్నా ఇప్పటి వరకు తేల్చలేదు. పోలీసుల విచారణలో కూడా నిరూపణ కాలేదు. కేసు పెట్టిన వారితో అప్పటి నుంచి మల్‌రెడ్డికి విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉగాది పండగ సందర్భంగా మల్‌రెడ్డి భార్య కమలమ్మ, కుటుంబ సభ్యులు పూజ సామగ్రితో ఊరిలోని రాముల గుడికి వెళ్లారు. అక్కడున్న ప్రత్యర్థులు వీరిని పూజ చేయరాదని అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగినందుకు దుర్భాషలాడడంతో పాటు దాడికి పాల్పడ్డారని మల్‌రెడ్డి భార్య కమలమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కమలమ్మ చెవికి గాయమవడంతో పాటు చెవికి ఉన్న బంగారపు కమ్మ పోయిందని తెలిపారు. ఈ దాడి సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో దళిత, మైనార్టీలకు రక్షణ లేదు

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిషోర్ బూసిపాటి అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద రీతిలో మృతి చెందితే కేసు నమోదు విషయంలోనూ, పోస్టుమార్టం చేసే సమయంలోనూ పోలీసులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అతన్ని అత్యంత దారుణంగా హత్య చేసిన ఆనవాళ్లు ఉన్నప్పటికీ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు వేగంగా చర్యలు తీసుకోవడంలో విఫలయ్యారన్నారు. దీన్నిబట్టి రాష్ట్రంలో క్రిష్టియన్ మైనార్టీలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా తిరిగే పరిస్థితి లేదని అర్థమవుతోందన్నారు. పగడాల ప్రవీణ్ తనకు ప్రాణహాని ఉందని చాలా రోజులుగా చెబుతున్నా ఆయనకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. హత్యపై అన్ని జిల్లాల్లో నిరసనలు వ్యక్తమవుతుంటే సీఎం చంద్రబాబుగానీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌గానీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి స్తంభాలైన భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ సిద్ధాంతాలు అమలవుతుండటం వల్ల మైనార్టీలు, క్రిష్టియన్లకు రక్షణ కరువవుతోందన్నారు. ప్రవీణ్ హత్య కేసులో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు పెంచలయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో 60 గొర్రెలు సజీవ దహనం



అగ్గికి ఆహుతైన గొర్రెలు



బాధిత రైతుతో మాట్లాడుతున్న అధికారులు

ములకలచెరువు : అగ్ని ప్రమాదంలో 60 గొర్రెలు సజీవదహనమైన సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. బాధితుడు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పర్తికోట పంచాయతీ పల్లెగడ్డగా పిలవబడే వసంతరాయునిపల్లెకు చెందిన పూజారి శ్రీరాములు గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉదయం మేత కోసం తన 122 గొర్రెలను సమీపంలోని సంద్రకొండకు తోలుకొని వెళ్లాడు. అక్కడ కొందరు ఆకతాయిలు మధ్యాహ్నం కొండకు నిప్పు పెట్టారు. గమనించిన కాపరి తన గొర్రెలను కొండ నుంచి కిందికి దింపే ప్రయత్నం చేశాడు. కానీ మంటలు వేగంగా కొండకు చుట్టుముట్టడంతో గొర్రెల మంద మంటల్లో చిక్కుకుపోయింది. బాధితుడు విషయాన్ని గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు వెళ్లేలోపే సుమారుగా 60 గొర్రెలు అగ్నికి ఆహుతయ్యాయి. మిగిలిన గొర్రెలను గ్రామస్తులు రక్షించారు. మిగిలిన వాటిలో సైతం గొర్రెలు అగ్నిలో కాలి తీవ్రంగా గాయపడ్డాయి. కళ్ల ముందే గొర్రెలు మంటల్లో కాలిపోవడంతో రైతు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి నివేదిత, ఎస్ఐ నరసింహుడు పరిశీలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకొన్నాడు.

పాలెంకొండలో ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం పాలెంకొండలో పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల వారు గొడవపడి కొట్టుకున్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. పాలెంకొండకు చెందిన చిన్నప్ప(59) అదే గ్రామానికి చెందిన నాగరాజుకు మధ్య గొడవలున్నాయి. గతంలో రెండు వర్గాలవారు గొడవపడి కొట్టుకుని కేసులు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి చిన్నప్ప ఓబిరెడ్డిగారిపల్లె నుంచి పాలెంకొండకు నడుచుకుని వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కొట్టారు. ఈ దాడిలో గాయపడిన చిన్ననప్పను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిన్నప్పపై నాగాజు కుటుంబ సభ్యులు దాడి చేసి ఉంటారని అనుమానంతోఅతని ఇంటిపై దాడికి వెళ్లారు. ఈ దాడిలో నాగరాజు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ కళావెంకటరమణ గ్రామానికి చేరుకుని ఇరవర్గాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నప్పను సీఐ, ఎస్.ఐ చంద్రమోహన్‌లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉగాది సంబరాలు

- పాల్గొన్న జిల్లా ఎస్పీ దంపతులు
- రంజాన్ పండుగ శుభాకాంక్షలు



ఉగాది వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో హాజరైన జిల్లా ఎస్పీ, ఆయన సతీమణి

రాయచోటి : అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విశ్వావసు నామ ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా ఎస్పీ సతీ సమేతంగా వేడుకలలో పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఎస్పీ దంపతులు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సాంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక పూజలలో పాల్గొని పోలీసు అధికారులకు సిబ్బందికి ఉగాది పచ్చడి, ప్రసాదం అందజేసి ఉగాది భోజనాలు వడ్డించారు.

రంజాన్ పండుగ శుభాకాంక్షలు..

పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సంతృప్తి, సంతోషాలతో జరుపుకోవాలని, రంజాన్ పర్వదినాన శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీకగా నిలవాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

స్పందన రద్దు..

రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 31వ తేదీ సోమవారం సెలవు దినంగా ప్రకటించింది. అందువలన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, రాయచోటి అర్బన్ సీఐ జి.చలపతి, ట్రాఫిక్ సీఐ ఎస్.విశ్వనాథ రెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికీ తప్పని రాజకీయం!

- కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ
- తాము చేస్తే ఒప్పు.. ఇతరులు చేస్తే తప్పు
- వివాదాస్పదంగా టీడీపీ అధ్యక్షుని వ్యవహారం

టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తాము చేస్తే ఒప్పు.. ఇతరులు చేస్తే తప్పు అన్నట్లుగా మండల టీడీపీ అధ్యక్షుడి వ్యవహార శైలి ఉంది. అధికారంలో ఉన్నాం కదా అని సర్పంచ్‌ను పక్కనపెట్టి తానే పెత్తనం చెలాయించాలనే ధోరణిలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. బద్వేలు మండలంలోని ఎస్.రామాపురం దళితవాడలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. ఇక్కడ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరులో సుద్దనీరు వస్తుండటంతో తరచూ మోటారు కాలిపోతోంది. ఈ నీటిని స్థానికులు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని సర్పంచ్ కూడా అంగీకరించి దానికి ప్రత్యామ్నాయంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఏదో ఒక విధంగా స్థానికంగా ఉన్న నీటి సమస్యను రాజకీయం చేయాలనే ఉద్దేశంతో దళితవాడలో ఉన్న కొందరు టీడీపీ నాయకులను మండల టీడీపీ అధ్యక్షుడు రెచ్చగొట్టడంతో పాటు టీడీపీ బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి ద్వారా అధికారులకు ఫోన్ చేయించారు. గతంలో వేసిన తాగునీటి బోరును సర్పంచ్ వర్గానికి చెందిన రైతు కబ్జా చేసి కంచె వేశాడని, ఆ బోరును ఎలాగైనా తిరిగి ఉపయోగించుకునేలా చూడాలని ఒత్తిడి తీసుకు వచ్చారు. దాదాపు 20 ఏళ్ల క్రితం వేసిన బోరు కావడంతో అది పూర్తిగా శిథిలమైంది. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి పొలం కావడం, ఎలాగైనా అతనిపై కక్ష సాధించాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలకు పాల్పడినట్లు తెలుస్తోంది. టీడీపీ నియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జి ఒత్తిడి మేరకు ఎంపీడీఓ రామనాథరెడ్డి, తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డిలు దళితవాడకు వెళ్లి అక్కడి పరిస్థితిని స్థానికంగా అడిగి తెలుసుకున్నారు. తరచూ మోటారు కాలిపోతోందని, నీటిలో సుద్ద వస్తోందని, ఈ నీటిని తాము ఉపయోగించుకోమని, ప్రత్యామ్నాయంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దళితవాడలో కొందరు రైతు పొలంలో ఉన్న బోరు ద్వారా తమకు తాగునీరు అందించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రైతు పొలంలో ఏళ్ల తరబడి వేసిన బోరును కూడా అధికారులు పరిశీలించారు. స్థానిక టీడీపీ నాయకుడు గ్రామ పంచాయతీ బోరును ఏకంగా కబ్జా చేసి ఉపయోగించుకుంటున్నాడని, ఆ బోరును కూడా పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వర్గం అధికారులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ కబ్జా చేసిన బోరును కూడా అధికారులు పరిశీలించారు. పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో పరిశీలించి ఏప్రిల్ 2వ తేదీ తర్వాత నిర్ణయం తీసుకుంటామని అధికారులు ఇరువురికి తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీఓ రామనాథరెడ్డిని వివరణ కోరగా దళితవాడలో తాగునీటి సమస్య ఉందని, ప్రత్యామ్నాయంగా నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో వేసిన గ్రామ పంచాయతీ బోర్ల కబ్జాలపై రెండు వర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని,పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీ సోమేశ్వరుడి సేవలో జిల్లా జడ్జి



శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి దంపతులు

కడప కల్చరల్ : కడప నగరం దేవుని కడపలోని శ్రీ సోమేశ్వరస్వామిని ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, రామారావు దంపతులు దర్శించుకున్నారు. ఉగాది పండుగ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేశారు. ఆలయ ఏఓ శ్రీధర్ వారికి స్వాగతం పలికి పూజాదికాలు నిర్వహింపజేశారు. అర్చకులు వేదోక్తంగా ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సామాజిక అడవిలో మంటలు

కమలాపురం : మండలంలోని రామచంద్రాపురం సమీపంలో ఉన్న సామాజిక అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ అటవీ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న తాటి చెట్ల నుంచి తాటి పట్టలు రాలి పోయి ఎండిపోయాయి. గుర్తు తెలియని ఆకతాయిలు వాటికి నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడుతూ చుట్టుపక్కలకు వ్యాపించాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

బస్సు–ద్విచక్ర వాహనం ఢీ



ఆర్టీసీ అద్దె బస్సు- ద్విచక్రవాహనం ఢీకొన్న దృశ్యం



తీవ్రంగా గాయపడిన ప్రదీప్ కుమార్ రెడ్డి

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటలోని ప్రధాన మలుపు వద్ద ఆదివారం సాయంత్రం బస్సు- ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు ప్రదీప్‌కుమార్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేల్ డిపోకు చెందిన అద్దె బస్సు కడప నుంచి బద్వేల్ వైపు వెళుతోంది. సంటిగారిపల్లె గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి సిద్దవటంలో పనులు ముగించుకొని సిద్దవటం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. రెండు వాహనాలు సిద్దవటం ఎగువపేటలోని ప్రధాన మలుపు వద్దకు రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి తలకు, ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రదీప్‌కుమార్‌రెడ్డిని వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్ల పోలీసులు తెలిపారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి

ట్రిపుల్ ఐటీ ఏఓ రవి కుమార్

కమలాపురం : ప్రతి విద్యార్థి గురువులు చెప్పే పాఠాలు విని అవగాహన చేసుకుని మంచి ఫలితాలు సాధించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ట్రిపుల్ ఐటీ ఆర్‌కే వ్యాలీ ఇడుపులపాయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రవి కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ భారతి విద్యా మందిర్ 6వ వార్షికోత్సవ వేడుకలను బీసీసీపీఎల్ సీఎంఓ సాయి రమేష్ పర్యవేక్షణలో ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రిపుల్ ఐటీ ఏఓ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా ఏరోజు చెప్పిన పాఠాలను అదే రోజు చదివి అవగాహన చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు కృషి చేయాలన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. వేంపల్లె ఎంఈఓ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలన్నీ శ్రద్ధగా విని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, అప్పుడే తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామాలకు మంచి పేరు ప్రతిష్టలు వస్తాయన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవాలన్నారు. కోర్ అడ్వైజరీ సుబ్బులక్ష్మీ సాయి రమేష్ మాట్లాడారు.

మా వాళ్లే టెండర్లు వేయాలి

కడప నగరపాలక సంస్థలో మా వాళ్లే టెండర్లు వేయాలి..ఇతర కాంట్రాక్టర్లు ఎవరూ వేయకూడదు. ఒకవేళ వేసినా వారి పనులు జరగనివ్వం. బిల్లులు రానివ్వం. టెండర్లు పొందిన వారు మేం ఎవరికి చెబితే వారికి ముట్టజెప్పాలి. ఇదీ తెలుగుదేశం పార్టీ ముఖ్యనేత, షాడో ఎమ్మెల్యే కాంట్రాక్టర్లకు చేస్తున్న హెచ్చరికలు.. తమ రూలును అతిక్రమించిన వారికి ఇబ్బందులు తప్పవని చెప్పకనే చెబుతున్నారు.. వివరాలిలా ఉన్నాయి.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

- ఇతరులు వేసేదానికి వీల్లేదు
- వేసినా పనులు చేయనివ్వం
- 15వ ఫైనాన్స్ టెండర్లలో పాల్గొనేవారికి షాడో ఎమ్మెల్యే బెదిరింపులు
- విస్తుపోతున్న రాజకీయవర్గాలు

కడప నగరపాలక సంస్థలో 15వ ఆర్థిక సంఘం కింద జనరల్ బాడీ ఆమోదించిన రూ.13.34 కోట్ల పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించింది. 2021-22 మొదటి దశ కింద రూ.2.94 కోట్లు, 2023-24 మొదటి దశ కింద రూ.7.44 కోట్లు, 2023-24 రెండో దశ కింద రూ.4.96 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను మంజూరు చేస్తూ గత నెలలో ఉత్తర్వులు జారీ అయ్యాయి. నగర పాలక వర్గం ఉన్నప్పటికీ ఆ టెండర్లన్నీ తమకే దక్కాలని టీడీపీ ముఖ్యనేత పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇతర కాంట్రాక్టర్లను పలు రకాలుగా బెదిరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆన్‌లైన్ టెండర్లు వేసే నెట్ సెంటర్ల యజమానులను పిలిపించుకొని ఈ మేరకు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. ఈ టెండర్లన్నీ మా వాళ్లకే దక్కాలి. ఆ పనులన్నీ మా వాళ్లే చేయాలి...మేము ఎవరికి చెబితే వారికి 8 శాతం కమీషన్ ముట్టజెప్పాలి. ఇందుకు విరుద్ధంగా ఎవరు టెండర్లలో పాల్గొన్నా పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.. పనులు చేయలేరు.. బిల్లులు కూడా మంజూరు కావని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ కాంట్రాక్టర్లు టెండర్లు వేయాలో జాబితా ఇచ్చి వారిచేతనే టెండర్లు దాఖలు చేయిస్తున్నట్లు తెలిసింది. దీంతో కార్పొరేషన్‌లో టెండర్లు వేయాలంటేనే మిగతా కాంట్రాక్టర్లు జంకుతున్నారు. గతంలో మంజూరైన పనులకు వీళ్లకెందుకు కమీషన్ ఇవ్వాలో తెలియక కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి నయాపైసా తీసుకురాకపోయినా.. పెత్తనమే

అభివృద్ధి పనులను త్వరగా, నాణ్యతగా చేసే కాంట్రాక్టర్లను ఆహ్వానించాల్సింది పోయి అడ్డుపడుతుండటాన్ని పలువురు తప్పుబడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క నయాపైసా నిధులు తేలేకపోయినా గత ప్రభుత్వంలో మంజూరైన కేంద్ర నిధులపై పెత్తనం చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. నగరాభివృద్ధిని కోరుకునే ఏ ప్రజా ప్రతినిధి ఇలా చేయరని, అందినకాడికి దోచుకొని, కార్యకర్తలకు దోచిపెట్టడానికే షాడో ఎమ్మెల్యే ఎక్కడా లేని రూలు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.